





8లో..

**ఇన్‌చార్జి సీపీగా మురళీధర్**


# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 98 | గురువారం | 12 అక్టోబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5




**మాకేవీ సంక్షేమ పథకాలంటూ నిలదీత**

**తాగు నీరు లేక తిప్పలు పడుతున్నామంటూ మండిపాటు**

**ఊహించని పరిణామాలతో ఉక్కిరిబిక్కిరవుతున్న బీఆర్ఎస్ నేతలు**

**దిద్దుబాటు చర్యలపై ఫోకస్**

# 'అరూరి'పై అసమ్మతి



వివరాలు 2లో..

## అడుగడుగునా నిరసనలు

వర్ధన్నపేట నియోజకవర్గంలో ఇంతకాలం నివురుగప్పిన నిప్పులా ఉన్న అసమ్మతి ఎన్నికల వేళ బహిర్గతమవుతోంది. ఇన్ని రోజులు ఎమ్మెల్యే అరూరి రమేష్ పై సొంత పార్టీలోని ముఖ్య నేతలే అసంతృప్తి వ్యక్తం చేయగా నేడు ప్రజలనుంచి కూడా తిరుగుబాటు మొదలైంది. అరూరి వద్ద పార్టీ నేతలకు అసలు గౌరవం లేదని, అలాంటి వ్యక్తికి టికెట్ ఇస్తే ఎలా మద్దతిస్తామంటూ ముఖ్య నేతలు ప్రకటిస్తుండగా, తొమ్మిదేళ్లు అధికారం ఇస్తే ప్రజల కోసం చేసిన అభివృద్ధి ఏదని జనం ప్రశ్నిస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే కాన్వాయ్ అడ్డగింతలతోపాటు ఎమ్మెల్యే గో బ్యాక్ అంటూ చేస్తున్న నినాదాలు నియోజకవర్గంలో మారుమ్రోగుతున్నాయి. అరూరి సాక్షిగా జరుగుతున్న నిరసనలతో బీఆర్ ఎస్ పార్టీ నేతలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో గ్రామాల్లో ఎన్నికల ప్రచారం సాగించడం ఎలా అన్న ఆందోళన ఎమ్మెల్యేతోపాటు పార్టీ శ్రేణుల్లో నెలకొంది. - వరంగల్ వాయిస్ ప్రతినిధి

## కమలంలో కదనోత్సాహం..

**తూర్పు బరిలో యువనేత..?**

**పోటీకి సిద్ధమంటున్న సిద్ధం నరేష్ పటేల్**

ప్రత్యేక కథనం 7లో..






8లో

## దసరా ఉత్సవాలకు రండి

**మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు వినతి**

## బుల్లెట్ వదిలి.. బ్యాలెట్ బాటలోకి

8లో

**పోటీకి సై అంటున్న మాజీలు**

## అత్తను తుపాకీతో కాల్చిన అల్లుడు

**అక్కడికక్కడే మృతి**

**డబ్బుల విషయంలో తగాదాగా అనుమానం**







2లో

# ‘అరూరి’పై అసమ్మతి



**అడుగడుగునా నిరసనలు**

**మాకేవీ సంక్షేమ పథకాలంటూ నిలదీత**

**తాగు నీరు లేక తిప్పలు పడుతున్నామంటూ మండిపాటు**

**ఊహించని పరిణామాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న బీఆర్ఎస్ నేతలు**

**దిద్దుబాటు చర్యలపై ఫోకస్**

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ నియోజకవర్గాల్లో పర్యటించేందుకు వెళ్తున్న బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలకు చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. పలువురికి అడుగడుగునా నిరసన సెగలు తప్పడంలేదు. ముఖ్యంగా వర్ధన్నపేట నియోజకవర్గంలో సొంత పార్టీ ముఖ్య నేతలే అరూరిపై అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. దళితబంధు, గృహలక్ష్మి వంటి ప్రభుత్వ పథకాలకు అర్హులను కాకుండా పార్టీ కార్యకర్తలకే కట్టబెట్టారంటూ జనం మండి పడుతున్నారు. గత ప్రభుత్వాలు పేదలకు పంపిణీ చేసిన ఇంటి స్థలాలను కూడా వెనక్కి తీసుకొని ఇతరులకు కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కాన్వాయ్ గ్రామంలో కనిపిస్తే చాలు పెద్ద ఎత్తున జనం తరలి వచ్చి ఆయన కార్యక్రమాలను అడ్డుకుంటున్నారు. ఎమ్మెల్యే గో బ్యాక్ నినాదాలతో ఆ ప్రాంతం మారుమ్రోగుతోంది. ఇచ్చిన హామీలను పక్కన బెట్టి కొత్తగా అది చేస్తాం..ఇది చేస్తాం అంటూ శంకుస్థాపనలు చేయడంపై మండి పడుతున్నారు.

## తాగునీటి సమస్య తీరేదెన్నడు..

వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో తాగునీటి సమస్య తీరేదెన్నడూ అంటూ జనం ప్రశ్నిస్తున్నారు. అసహనం కోల్పోతున్న జనం తిరగబడుతున్నారు. ఇటీవల మునిసిపల్ ఆఫీస్ ప్రారంభోత్సవానికి వచ్చిన అరూరిని స్థానిక మహిళలు అడ్డుకొని నిరసన తెలిపారు. మంచినీళ్లు కావాలంటూ నినదించారు. గత తొమ్మిది సంవత్సరాలుగా తాగునీటికోసం స్థానిక కౌన్సిలర్, మునిసిల్ కమిషనర్ ని వేడుకున్నా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. తాగేందుకు నీరు లేక తల్లడిల్లుతుంటే తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఇంటింటికి మిషన్ భగీరథ ద్వారా నీళ్లు ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని ఆరోపించారు. కాలనీవాసులు ఎమ్మెల్యే కారుకు అడ్డుగా రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఇటీవల వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు వెళ్లిన ఎమ్మెల్యే అరూరికి జనం నుంచి అడ్డగింతలు తప్పలేదు.



## సొంత పార్టీలోనూ..

సొంత పార్టీలోనూ ఎమ్మెల్యే అరూరి రమేష్ కు అసమ్మతి సెగలు తప్పడంలేదు. ఈ సారి లక్ష మెజారిటీతో గెలవడం పక్కా అనుకున్న ఈ స్థానంలో సొంత పార్టీ నేతలే ఆయనకు టికెట్ ఇస్తే పనిచేయమంటూ బాహాటంగా ప్రకటించడం చర్చనీయాశంగా మారింది. అరూరి వద్ద పార్టీ నేతలకు అసలు గౌరవం లేదని, అలాంటి వ్యక్తికి మద్దతెలా ఇస్తామంటూ అసమ్మతి నేతలంతా ప్రత్యేక సమావేశాలు కూడా నిర్వహించారు. చివరకు బీఆర్ ఎస్ పార్టీ పెద్దలు చొరువ చూపి సయోధ్య కుదుర్చడంతో అసమ్మతి సమసిపోయింది. అయినప్పటికీ సీనియర్ నాయకులు ఎన్నికల్లో ఎమ్మెల్యేతో కలిసి పనిచేస్తారా అన్న అనుమానం వ్యక్తమవుతోంది.

## పార్టీ శ్రేణులకేనా..

ప్రభుత్వ సంక్షేమ పథకాలైన దళితబంధు, గృహలక్ష్మి తమకెందుకు రావడం లేదంటూ ఎమ్మెల్యే అరూరిని ప్రజలు నిలదీస్తున్నారు. అర్హులను కాదని పార్టీ శ్రేణులకే పథకాలు వర్తింపజేస్తే రేపు వారి ఓట్లతోనే విజయం సాధిస్తారా అంటూ అడుగుతున్నారు. ఇప్పటికే దమ్మన్నపేట గ్రామస్థులతోపాటు గబ్బెడ తండా, చెన్నారం గ్రామాల్లోని ప్రజలు ఎమ్మెల్యేపై తిరుగుబాటు బాహుట ఎగురవేశారు.

## తప్పని ఎదురీత..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఒక్క వర్ధన్నపేట నియోజకవర్గంలోనే సిట్టింగ్ ఎమ్మెల్యే అరూరి రమేష్ కు ఎదురు లేదని అనుకుంటున్న తరుణంలో ప్రజలనుంచి వస్తున్న నిరసనలు పార్టీ వర్గాలను కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఓ వైపు పార్టీలోని అంతర్గత పోరు, మరోవైపు ప్రజల నుంచి వెల్లువెత్తున్న నిరసన అరూరి విజయానికి గండి కొడుతున్నాయి. వీటి నుంచి తప్పించుకొని ఎలా బయట పడతాడోనన్న చర్చ నియోజకవర్గంలో వైరల్ అవుతోంది.

## ఎమ్మెల్యే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి..

అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ డబుల్ బెడ్ రూమ్ పథకంలో భాగంగా ఇల్లు కేటాయించాలని కోరుతూ వర్ధన్నపేట వర్కింగ్ జర్నలిస్టులు గురువారం వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏఓ శ్రీకాంత్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు అరూరి రమేష్ కొంతమంది జర్నలిస్టులకు మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయిస్తూ తీసుకున్న ఏకపక్ష నిర్ణయం సరైంది కాదన్నారు. వర్ధన్నపేట పరిధిలో పని చేస్తున్న జర్నలిస్టుల్లో చీలికలు తెచ్చి గ్రూపులను ప్రోత్సాహించే విధంగా తనకు అనుకూలంగా ఉండే కొంతమంది జర్నలిస్టులకు మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేస్తామన్న ఎమ్మెల్యే అరూరి రమేష్ తీరు మిగతా సీనియర్ జర్నలిస్టులను కించపరిచే విధంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపు పట్ల సమగ్ర విచారణ జరిపి ప్రతి జర్నలిస్టుకు సమన్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ మార్నేని రవిందర్ రావును హనుమకొండలోని డీసీసీ బ్యాంకు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. దీనికి మార్నేని రవిందర్ రావు సానుకూలంగా స్పందించి జర్నలిస్టులందరికీ న్యాయం జరిగేలా ఎమ్మెల్యే అరూరి రమేష్ తో చర్చిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శ్రీరాం రమేష్, ఆత్మకూరి రాధాకృష్ణ, మహ్మద్ అజీజుద్దీన్, అలువాల భిక్షపతి, అయిత ప్రవీణ్ కుమార్, దొమ్మటి భాను, బిర్రు కుమారస్వామి, రాజేందర్, నాంపల్లి మల్లేశం, బుర్ర వెంకటరమణ, పవన్, నరేష్, మురళి, కంజర్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# కంటి డాక్టర్లకు సన్మానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకొని జేపీఎన్ రోడ్ లో గత 40 సంవత్సరాలుగా కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ టి.నరహరి, డాక్టర్ బీవీ.మల్లికార్జున్ లను ఏ. రాజేంద్రప్రసాద్ చారిటబుల్ ట్రస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ మన కళ్ళు వెయ్యి కెమెరాల కన్నా ఎంతో శక్తివంతమైనవన్నారు. భగవంతుడు మనకు ఇచ్చిన ఈ కళ్ళను అంతిమ జీవనం వరకు కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. అనంతరం మన కళ్ళను దానం చేస్తే ఇద్దరు అందులకు చూపును అందించిన వాళ్ళం అవుతామన్నారు. ఈ విధంగా మన మరణాంతరం కూడా ఇద్దరిలో జీవించి ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్ తో పాటు ఆర్గనైజర్ శ్రవణ్, మంత్రి లింగ మూర్తి, మోహన్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# అత్తను తుపాకీతో కాల్చిన అల్లుడు

## అక్కడికక్కడే మృతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలో గురువారం దారుణం చోటు చేసుకుంది. మంచిర్యాల జిల్లా కోటపల్లిలో పోలీస్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న కానిస్టేబుల్ ఆదప్రసాద్ గురువారం హనుమకొండ జిల్లా గుండ్ల సింగారం ప్రాంతానికి చెందిన తన అత్త కోమలను సర్వీస్ రివాల్వర్ తో కాల్చి చంపాడు. స్థానికులకు కథనం ప్రకారం.. ప్రసాద్ కు ఇవ్వవలసిన రూ.4 లక్షల విషయంలో గత కొంత కాలంగా అత్తా, అల్లుడి మధ్య వివాదం జరుగుతోంది. ఇందులో భాగంగా గురువారం డబ్బుల విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. దీంతో ఆగ్రహానికి గురైన ప్రసాద్ తన సర్వీస్ రివాల్వర్ తో అత్తపై కాల్పులు జరుపగా అమె అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న కేయూ పోలీస్ ఇన్ స్పెక్టర్ అబ్బయ్య నేతృత్వంలో సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. అయితే హత్యకు సంబంధించిన పూర్తి వివరాలను దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

## సోషల్ మీడియాలో హద్దుమీరితే కఠిన చర్యలు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమలు లోకి వచ్చిందని, ప్రతి ఒక్కరూ విధిగా ఎన్నికల కోడ్ పాటించాలని, లేకుంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేష్ హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. సోషల్ మీడియాలో ఎవరైనా ఇతర వ్యక్తులను గానీ, ఇతర పార్టీలను కించపరిచే విధంగా లేదా రెచ్చగొట్టే విధంగా పోస్ట్ లు పెడితే వారితో పాటు గ్రూప్ అడ్మిన్ పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాబట్టి మండలంలోని ప్రతి ఒక్కరూ విధిగా ఎన్నికల నిబంధనలు పాటించాలని, ఎన్నికల నిబంధనలకు ఎవరైనా విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై తెలిపారు.

## అనాథశ్రమానికి నిత్యావసర సరుకుల వితరణ



**వరంగల్ వాయిస్, రేగొండ :** రేగొండ బీఆర్ఎస్ యూత్ టౌన్ ప్రెసిడెంట్ మాడగానీ నరేష్ గౌడ్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని సహృదయ అనాథశ్రమంలో 80మందికి ఉదయం టిఫిన్స్ అందజేశారు. అనాథలకు, పేదలకు తన పుట్టినరోజు సందర్భంగా సేవ చేయాలనే సదుద్దేశంతో టిఫిన్స్, పండ్లు, 25కిలోల బియ్యం పంపిణీ చేస్తున్నట్లు నరేష్, అతని స్నేహితులు తెలిపారు. రేగొండలో యూత్ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి నరేష్ ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకొని ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. సహృదయ అనాథ వృద్ధాశ్రమంలో పుట్టినరోజు జరుపుకున్న నరేష్ ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపెల్లి రాజు (చింటూ) బొడ్డు శ్రావణ్, మాడగాని శివ, తడక కార్తీక్, మార్కరాజు, తదితరులు యూత్ నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన కాశిబుగ్గ దసరా ఉత్సవ కమిటీ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 20డివిజన్ లో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలలో భాగంగాకాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు ధూపం సంపత్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్యను కలిసి బతుకమ్మ దసరా పండుగకు కావలసిన ఏర్పాట్ల గురించి కలెక్టర్ కు మెమోరాండం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ దసరా ఉత్సవాలు కావాల్సిన పూర్తి ఏర్పాట్లు చేయిస్తానని హామీ ఇచ్చారు. త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్, దసరా ఉత్సవ సమితి కన్వీనర్ మాజీ కార్పొరేటర్ భయ్యా స్వామి, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్, దసరా పరపతి సంఘం ప్రధాన కార్యదర్శి బాంబుల కుమార్, ఆర్టీఏ మెంబెర్ గోరంటల మనోహర్, గుత్తికొండ నవీన్, ఓం ప్రకాష్ కొలారియా, దుబ్బ శ్రీనివాస్, మార్టిన్ లూథర్, వేముల నాగరాజు, సిద్ధోజు శ్రీనివాస్, రాచర్ల శ్రీనివాస్, మార్త ఆంజనేయులు, రామ యాదగిరి, ములుక సురేష్, కోట సతీష్, వలపదాసు గోపి, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు అన్యాయం

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తొర్రూరు పట్టణ, మండల కేంద్రానికి చెందిన స్థానిక వర్కింగ్ జర్నలిస్టులు సంయుక్తంగా మాట్లాడుతూ పట్టణ కేంద్రంలో గత 6 నుంచి 9 సంవత్సరాలుగా వివిధ పత్రిక రంగాలలో పనిచేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటున్నజర్నలిస్టులకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్యాయం చేశారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలకు బదులు డబుల్ బెడ్రూమ్స్ ఇండ్లను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ కు ఊడిగం చేసే వారికే స్థానిక అధికారులు కేటాయిస్తూ పట్టాలు అందజేశారు. దీంతో నిజమైన స్థానిక వర్కింగ్ జర్నలిస్టులు అనర్హులైన జర్నలిస్టులపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో వెంటనే వారు స్పందించి ఇచ్చిన ఇండ్ల పట్టాలను 40మంది జర్నలిస్టు నుంచి తిరిగి తీసుకోవడం జరిగింది. మంత్రికి దగ్గర ఉంటూ ఎర్రబెల్లి వ్యవహారాలను చూసుకుంటున్న ఒక జర్నలిస్టు నాయకుడు దయాకర్ రావుకు లేనిపోని మాయ మాటలు చెప్పి అక్రిడేషన్ కార్డు ఉన్న జర్నలిస్టులకే డబుల్ బెడ్ రూమ్ ఇస్తామని మంత్రితో చెప్పించారు. తద్వారా జర్నలిజంను నమ్ముకొని జీవిస్తున్న నిజమైన వర్కింగ్ జర్నలిస్టులకు మొండి చేయి చూపించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రిడేషన్ కార్డులు ఉన్నాయంటున్న జర్నలిస్టులు ఒక పేపర్ లో పనిచేస్తూ మరో పేపర్ పై అక్రిడేషన్ పొందారని బాధిత జర్నలిస్టులు ఆరోపిస్తున్నారు. అక్రిడేషన్ పేరుతో జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అంటూ బీపీఎల్ కింద జర్నలిస్టుల భార్యల పేర్లపై డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. జర్నలిస్టులుగా కొనసాగుతున్న కొంతమంది భార్యలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నప్పటికీ బీపీఎల్ కింద డబల్ బెడ్ రూమ్ ఇండ్లను ఎలా కేటాయిస్తారని



స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొంతమంది, జర్నలిస్టు నాయకులు, స్థానిక వర్కింగ్ జర్నలిస్టులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే వర్కింగ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో కార్యచరణను రూపొందించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వచ్చే వరకు ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ జర్నలిస్టుల ఫోరం జిల్లా అధ్యక్షుడు వెల్తూరి పూర్ణ రామచందర్ మాదిగ, ముస్లిం జర్నలిస్టుల ఫోరం నాయకులు మహమ్మద్ అమీర్, డివిజన్ జర్నలిస్టు నాయకులు రాజేందర్ నాయక్, స్థానిక వర్కింగ్ జర్నలిస్టు పెందోట కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



**వరంగల్ వాయిస్, నడికూడ :** నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం బతుకమ్మ వేడుకలను శ్రీ సాయి ట్రస్ట్ హనుమకొండ వారి ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థుల తల్లులు బతుకమ్మను తీసుకొచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా శ్రీ సాయి ట్రస్ట్ హనుమకొండ అధ్యక్షురాలు వేముల ప్రభావతి హాజరై మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మని, తెలంగాణ ఆడబిడ్డల పండుగని అన్నారు. బతుకమ్మను రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి పూలను పూజించే సంస్కృతి మన తెలంగాణ ఆడబిడ్డలకే ఉన్నదని తెలిపారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అనే పాటలలో మహిళలు తమ కష్టసుఖాలు, ప్రేమ, స్నేహం, బంధం, ఆప్యాయత, భక్తి ,,భయం ఉంటుందని అన్నారు. బతుకమ్మ వేడకల్లో పాల్గొన్న తల్లులకు శ్రీ సాయి ట్రస్ట్ అధ్యక్షురాలు వేముల ప్రభావతి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు పట్టు చీరలు అందజేసి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పోలంపల్లి విజేందర్, నిగ్గుల శ్రీదేవి, పరశువేణి జ్యోతి, అంగన్వాడీ టీచర్స్ భీముడి లక్ష్మీ, నందిపాటి సంధ్య, తాళ్లపల్లి మంజుల, శీలం సరిత, తల్లులు, విద్యార్థిని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంథని బరిలో మరో బీసీ నేత

### తెలుగుదేశం నుంచి అందె భాస్కరాచారి



**వరంగల్ వాయిస్, కాటారం :** త్వరలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మంథని నుంచి మరో బీసీ నేత బరిలో ఉండనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈసారి తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందనే విషయం విధితమే. కాగా 1987 నుంచి విద్యార్థి నాయకుడిగా తెలుగుదేశం పార్టీలో చేరిన సీనియర్ నాయకుడు "విశ్వకర్మ సామాజిక వర్గానికి" చెందిన అందె భాస్కరాచారి పేరును తెదేపా పార్టీ అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. మంథని రాజకీయాలు బహుజనుల చుట్టూ తిరుగుతున్న నేపథ్యంలో, బహుజన వాదం బలంగా వినిపిస్తున్న తరుణంలో రాజకీయాలకు ఆమడ దూరంలో ఉన్న విశ్వకర్మ సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి టిడీపి టికెట్ కెటాయింపునకు పరిశీలిస్తుండటంతో మరోసారి తెలుగుదేశం పార్టీ బడుగుల పక్షమేనని నిరూపించుకుంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భాస్కరాచారి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుపరిచితుడు కావడం, దశాబ్ద కాలం పాటు ఆంధ్రజ్యోతి లాంటి ప్రముఖ దినపత్రికలో జర్నలిస్ట్ గా పని చేసిన అనుభవంతో పాటు అనేక సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ నిత్యం ప్రజాసేవతో తూర్పు డివిజన్ లో ప్రతీ గడపగడపకు పరిచయం ఉన్నవాడు. అంతే కాకుండా 2006, 2014 సంవత్సరం లలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బీ ఫామ్ పై మహాముత్తారం జడ్పీటీసీ సభ్యుడిగా పోటీచేశారు. 2006-2013 వరకు భాస్కరాచారి సతీమణి అందె సంధ్యారాణి మండలంలోని బోర్లగూడెం ఎంపీటీసి గా తెలుగుదేశం పార్టీలో గెలుపొందారు. భాస్కరాచారి విశ్వకర్మ హక్కుల పోరాట సమితిలో ఉమ్మడి రాష్ట్రంలో ప్రదాన కార్యదర్శిగా పని చేశారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ పెద్దపెల్లి పార్లమెంట్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

# ఎన్ఆర్ఈజీఎస్ పనులను వేగవంతం చేయాలి

### కలెక్టర్ కె.శశాంక

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గురువారం జిల్లా కలెక్టర్ కె.శశాంక జిల్లా ఫారెస్ట్ అధికారి రవికిరణ్ తో కలిసి ఎన్ఆర్ ఈజీఎస్ పనుల పర్యవేక్షణపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 9మండలాలలో ఎన్ఆర్.ఈ.జి.ఎస్ ద్వారా సాంక్షన్ అయిన పనులను పూర్తి చేయాలని ఎన్నికల ప్రవర్తన నియామావాలి ఉన్నందున మండలాలలో, గ్రామాల్లో కేవలం సాంక్షన్ అయి పెండింగ్ లో ఉన్న పనులను మాత్రమే త్వరగా పూర్తిచేయాలని ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనులను వేగవంతంగా చేయాలని, ఇంకా ఏమైనా అత్యవసర పనులకు ఎలక్షన్ కమిషన్ ఆదేశాలకనుగుణంగా సాంక్షన్ చేసుకొని పనులను పూర్తి చేయుట జరుగుతుందని తెలిపారు. కాబట్టి ప్రస్తుతం ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేసుకుంటూ వారానికి ఒకసారి వాటి స్థితిని పరిశీలించుకోవాలని అధికారులకు సూచించారు. పూర్తిచేసిన పనుల నివేదికలను రోజు వారీగా తెప్పించుకోవాలని డీఆర్డీఏ పీడీని ఆదేశించారు. డీఎఫ్ఓ రవికిరణ్



మాట్లాడుతూ మండలాలలో పనులు జరిగే ప్రతిచోట రేంజ్ అధికారులు తప్పనిసరిగా ఉండాలని ట్రెంచింగ్ పనులలో రెవెన్యూ అధికారులకు అలైన్ మెంట్ కు సంబంధించిన సందేహాలు ఉంటే నివృత్తి చేసుకొని పనులు త్వరగా జరిగేందుకు రెవెన్యూ అధికారులకు సహకరించి పనులు త్వరగా పూర్తి అయ్యే విధంగా చూడాలన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో డీఆర్ డీఏ పీడీ సన్యాసయ్య, డివిజనల్, రేంజ్ అటవీ అధికారులు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలపై అవగాహన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 5వ డివిజన్ శారదా గార్డెన్స్ లో గురువారం ఆరు గ్యారంటీ పథకాలపై డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి మహిళా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జంగా రాఘవ రెడ్డి మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రస్తుతం కేవలం ఒక కుటుంబానికే లబ్ది జరిగిందన్నారు. తెలంగాణ ప్రజల కష్టాలు చూసి చలించిన తెలంగాణ తల్లి సోనియా గాంధీ ఆరు పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. కాబట్టి మీరందరూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి నవంబర్ 30న జరగబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని మహిళలను కోరారు. మహిళా శక్తీ అండగా ఉంటే ఎంతటి యుద్ధంనైనా గెలవొచ్చన్నారు. కాబట్టి మహిళలు అందరు సోనియా గాంధీకి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ ను ప్రజలు నాలుగు సార్లు ఓట్లు వేసి గెలిపిస్తే తను ప్రజలకు చేసింది ఏమీ లేదని, ఇప్పటివరకు నియోజకవర్గ ప్రజల కనీస అవసరాలు, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, బస్తీల అభివృద్ధి, వరద ప్రభావానికి గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. తన సొంత లాభం కోసం వినయ్ భాస్కర్ గారు పని చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా జంగా రాఘవ రెడ్డి తనని రాబోయే ఎన్నికలో పశ్చిమ ఎమ్మెల్యే గా గెలిపిస్తే నియోజకవర్గ ప్రజల కష్ట సుఖాలలో తోడుగా ఉంటానని అన్నారు. ఈ నియోజకవర్గంలో తన సొంత నిధులతో ఒక్క కార్పొరేట్ స్థాయి హాస్పిటల్, ఒక్క స్కూల్ ఏర్పాటు చేసి ఉచితంగా కార్పొరేట స్థాయిలో వైద్యం, విద్య అందిస్తా అని తెలిపారు. కేంద్రం లో బీజేపీ అధికారం లో వచ్చిన తరువాత గ్యాస్, పెట్రోల్ నిత్యావసర ధరలను సామాన్యులకు అందుబాటులో లేకుండా చేశారని దుయ్యబట్టారు. మతాల మధ్య, కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని ఫైరయ్యారు. రాబోయే ఎన్నికలో ఈ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని మహిళలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కాంటెస్టెడ్ కార్పొరేటర్లు, యూత్ కాంగ్రెస్ నాయుకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయుకులు తదితరులు పాల్గొన్నారు.

## పల్లా ఎవరో కూడా జనగామ ప్రజలకు తెలియదు

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి



**వరంగల్ వాయిస్, బచ్చన్నపేట :** మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రెండుసార్లు ఎమ్మెల్సీగా గెలిచిన పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగామకు ఏం చేశాడో ప్రజలకు చెప్పాలని జనగామ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి అన్నారు. జనగామ లో ఉన్న యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చాడో చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఎమ్మెల్సీగా ఉన్న పల్లె రాజేశ్వర్ రెడ్డి ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి నైజం కబ్జాలు, బెదిరింపులకు పాల్పడటమేనని తెలిపారు. అలాంటి కబ్జాకోరును జనగామ ప్రజలు ఎప్పటికీ నమ్మరని పేర్కొన్నారు. స్థానికంగా లేని పల్లా రాజేశ్వర్ రెడ్డికి జనగాంలో పోటీ చేసే అర్హత లేదన్నారు. జనగాంలో ఉన్న భూములను ముత్తిరెడ్డి కబ్జా చేయడానికి తోడుగా పల్లా రాజేశ్వర్ రెడ్డిని తీసుకువచ్చాడని ఎద్దేవా చేశారు. ఇలాంటి కబ్జా కోర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగామకు వచ్చి చేసేదేమీ లేదని విమర్శించారు. జనగామ ప్రాంతంలో ఒక డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ చేయని, చేతకాని ప్రభుత్వం బీఆర్ఎస్ అని మండిపడ్డారు. ఈకార్యక్రమంలో జనగామ అసెంబ్లీ కన్వీనర్ బల్ల శ్రీనివాస్ , మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చౌడ రమేష్, జిల్లా సోషల్ మీడియా కోకన్వీనర్ గద్దరాజు, జిల్లా నాయకుల సంపత్, రవీంద్ర చారి, సాంబయ్య, బాలరాజు, పాల్గొన్నారు.

## సంగాల కోమలకు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం పరిశోధకురాలు సంగాల కోమలకు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య పి.మల్లారెడ్డి డాక్టరేట్ ప్రకటించారు. డాక్టర్ సంగాల కోమల "తెలంగాణ ఉద్యమ సాహిత్యం"అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. డాక్టర్ సంగాల కోమల విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య వేలూరి శ్రీదేవి పర్యవేక్షణలో తన పీహెచ్ డీ పూర్తి చేశారు. పెద్దమ్మగడ్డ, హనుమకొండకు చెందిన డాక్టర్ కోమల ప్రస్తుతం విశ్వవిద్యాలయ కెమిస్ట్రీ విభాగంలోని ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సులో తెలుగు బోధకురాలిగా పని చేస్తున్నారు. పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డాక్టర్ సంగాల కొమలను అభినందించారు.

## అభివృద్ధి లేమికి కాంగ్రెస్ నాయకులే కారణం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన సర్పంచ్ అధికార బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు అందిస్తున్న ఫలాలను ప్రజలకు అందించకుండా అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. డోర్నకల్ మండలంలోని చిల్కోయలపాడు బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు గజ్జి మల్లేశం, కార్యదర్శి ఊడుగుల వీరన్న, మాజీ సర్పంచ్ వెంకన్న, మాణ్యాలు, మండల యూత్ కార్యదర్శి బోయిన సందీప్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు బోయిన రంజిత్ తదితరులు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత మూడ సంవత్సరాలుగా గ్రామాభివృద్ధికి నియోజకవర్గ ఎమ్మెల్యే రెడ్యానాయక్ దాదాపు 70లక్షల రూపాయలు నిధులు కేటాయించగా వాటికి వీడీసీ ఇవ్వకుండా గ్రామ సర్పంచ్ అడ్డు చెబుతున్నారన్నారు. ప్రతి పనికి కమీషన్ రూపంగా డబ్బులు అడుగుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. గత రెండు నెలల క్రితం గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే రూ.45లక్షల నిధులు కేటాయించి సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తే వీడీసీ ఇవ్వకుండా పనులు నిలుపుదల చేశారన్నారు. దీనిపై కార్యదర్శి అనేక మార్లు ఎంపీడీఓ, గ్రామ కార్యదర్శిని వేడుకున్నామన్నారు. ఎలక్షన్ కోడ్ వస్తుందని వీడీసీ ఇచ్చేందుకు ముందుకు వచ్చిన గ్రామ కార్యదర్శిని కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు గురి చేశారని దీంతో ఆయన ఆత్మహత్యయత్నం చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా తమతో పాటు కలిసి నడిచి గ్రామ అభివృద్ధికి సహకరించాలని సూచించారు.

## ప్రమాద బీమా చెక్కు అందజేత



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట పట్టణానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు కొడవాటి సారయ్య విధులు నిర్వహిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి చనిపోయాడు. మృతి చెందిన సారయ్య గతంలో కాజీపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాజీపేట బ్రాంచ్ లో రూ.500 ఎస్ బీఐ ప్రమాద బీమా పథకంలో చేరడం వలన అతని కుటుంబ సభ్యుల సమక్షంలో కొడవాటి సుమలతకు ఎస్ బీఐ జనరల్ ఇన్సూరెన్స్ తరపున రూ.10లక్షల ప్రమాద చెక్కును కాజీపేట ఎస్ బీఐ బ్రాంచ్ లో ఎస్ బీఐ అధికారులు అందజేశారు. ప్రమాద బీమా చెక్కును అందుకున్న సుమలత బ్యాంకు ద్వారా ఆర్థిక సహాయం చేసిన బ్యాంక్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ బీఐ బ్యాంక్ డీజీఎం వివేక్ చంద్ర జైస్వాల్, ఏజీఎం రఘునాథ్, ఎస్ బీఐ కాజీపేట బ్రాంచ్ మేనేజర్ షానాజ్ బేగం, ఎస్ బీఐ జర్నలిస్ట్ మాడ్యూల్ మేనేజర్ ఎన్ మహేశ్వర్ రెడ్డి, మేనేజర్ దేవేందర్, బీడీఎం సీహెచ్ వెంకటేష్, మృతుడి కుటుంబ సభ్యులు కొడవాటి రవి, బట్టు ప్రభాకర్, శోభారాణి స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి బీజేపీ ప్రజా ఆశీర్వాద యాత్ర



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మానుకోట నియోజకవర్గంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు బీజేపీ, ఇంటింటికి ప్రజా ఆశీర్వాద యాత్ర మూడో విడత 5వ రోజు కార్యక్రమంలో భాగంగా గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ జాటత్ హుస్సేన్ నాయక్ పాల్గొన్నారు. పట్టణంలోని స్థానిక బాబు నాయక్ తండా కాలనీలలో ప్రతి గడపగడపకు వెళ్లి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. మెడికల్ కాలేజీ పేరుతో బాబు నాయక్ తండాలోని నిరుపేదల భూములు గుంజుకున్నారని, కనీసం నష్టపరిహారం కూడా చెల్లించలేదని స్థానిక ఎమ్మెల్యే శంకర్ నాయక్ పై విరుచుక పడ్డారు. మానుకోట పట్టణానికి కేసీఆర్. కేటీఆర్ వచ్చినప్పుడల్లా బాబు నాయక తండా రైతులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మానుకోట పట్టణంలో భాగంగా ఉన్న బాబు నాయక్ తండాలో కనీసం గిరిజనులకు సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంపై విస్మయం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలలో తనని ఎమ్మెల్యేగా గెలిపిస్తే బాబు నాయక్ తండాలో మెడికల్ కాలేజీ కోసం భూములు కోల్పోయిన వారికి మరొకచోట భూములు మంజూరు చేస్తానని, తండా అభివృద్ధికి కట్టుబడి ఉంటానని గిరిజనులకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మానుకోట అసెంబ్లీ కన్వీనర్ ఎర్రం రెడ్డి సిద్ధార్థ రెడ్డి, శక్తి కేంద్ర ఇంచార్జి రత్నావతి రమేష్ నాయక్, పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లె సందీప్, వేన్నమల్ల సందీప్, గిరిజన మోర్చా నాయకులు రాంబాబు, బాలు నాయక్, యువ మోర్చా ప్రేమ్ కుమార్, బాబు నాయక్ తండా బూత్ అధ్యక్షుడు వినోద్‌నాయక్ పాల్గొన్నారు.

## సెయింట్ థామస్ హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోనీ చైతన్యపురి కాలనీలో గల సెయింట్ థామస్ హై స్కూల్ లో బతుకమ్మ పండుగ సందర్భంగా గురువారం ముందస్తుగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు అందరూ బతుకమ్మలతో సాంప్రదాయ దుస్తులు ధరించి కోలాటలతో ఆటపాటలతో అలరించారు. పాఠశాల సెక్రేటరీ జే.మనోహర్ విద్యార్థులకు చిన్నప్పటి నుంచే మన తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల గురించి అవగాహన కల్పించడం వలన పండుగలపై సాంప్రదాయాలు మక్కువ పెరుగుతుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన సోషల్ కమ్యూనికేషన్ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయానికి దోహదం చేసిన తల్లిదండ్రులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## కాంగ్రెస్ పథకాలకు విశేష స్పందన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కేఆర్ నాగరాజు నేతృత్వంలో వర్ధన్నపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని 56వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రావుల వెంకట రమేష్ గౌడ్ అన్నారు. గురువారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ బంజారా కాలనీ, పూరిగుట్టలో 56వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు పల్లకొండ విజయ్ సూర్య, గుగులోత్ స్వరూప వీరన్న ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాల కార్డులను ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు కేఆర్ కృష్ణమూర్తి, అరకుల ప్రభాకర్ రెడ్డి , లావుడ్య రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మాదాసి సురేష్‌కు చేయూత



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మండలంలోని నాగయ్య పల్లికి చెందిన దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ తండ్రి మాదాసి ఎర్ర సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో చనిపోగా బుధవారం ప్రముఖ న్యాయవాది అసైన్డ్ భూమి సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ మాదాసి సురేష్ ను పరామర్శించి రూ.5000ల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కలకోటి మహేందర్ మాట్లాడుతూ అనేక సామాజిక ఉద్యమాలు, పలు సమస్యలపై పోరాటం చేస్తున్న మాదాసి సురేష్ సమాజానికి అవసరమైన వ్యక్తి అని, అతడికి అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన ఉద్యమ నాయకుడు, న్యాయవాది వేముల రమేష్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ హనుమకొండ జిల్లా సభ్యులు చుంచు రాజేందర్, మహాత్మ జ్యోతిరావు పూలే సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేరళ ప్రసాద్, బీఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఐతం నగేష్, తెలంగాణ ఉద్యమకారుడు దామెరకొండ కొమురరయ్య, చుంచు నరేష్, స్థానిక నాయకులు జింక అశోక్, మాదాసి శ్రీనివాస్, మాదాసిరాజు, గిన్నారపు ప్రసంగి,మాదాసి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీఎన్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట పట్టణం, విష్ణుపురిలోని ఎస్వీఎన్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సంబరాలలో విద్యార్థిని, విద్యార్థులు, యువత, అధ్యాపకులు నూతన వస్త్రాలను ధరించి వివిధ రకాల పూలతో పేర్చిన బతుకమ్మలను పెట్టుకొని ఆటపాటలతో, డీజే డ్యాన్సులతో బతుకమ్మ సంబరాలు చేసుకుని పండుగకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎన్ పాఠశాల కరస్పాండెంట్ చేతి శ్రీనివాస్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు వసంత, సరిత, వీణ, మాధవి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## గడపగడపకు బీజేపీ పథకాలు



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ఊరుగొండ గ్రామంలో మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు ఆధ్వర్యంలో గడపగడపకు బీజేపీ నాయకులు వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలుపుతూ కమలం పువ్వు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, డా.పగడాల కాళీ ప్రసాద్ రావు, ఓబీసీ కార్యవర్గ సభ్యులు గొల్లపల్లి గిరిధర్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గంకిడి బుచ్చిరెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల దివాకర్, సోషల్ మీడియా కన్వీనర్ ముత్యాల రాజశేఖర్, శక్తి కేంద్రం ఇంచార్జ్ దామసాని శ్రీనివాస్ రెడ్డి, బూత్ అధ్యక్షులు అయిత చేరాలు, మేడిపల్లి శ్రీనివాస్, పూజారి సత్యనారాయణ, అగ్రంపాడు వెంకన్న, మడిశెట్టి రవీందర్, బూత్ అధ్యక్షులు గోగుల సమ్మిరెడ్డి, సతీష్, గండు పరశురామ్, పోలేపాక చేరాలు, బొచ్చు శ్రీనివాస్ ఇతర బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడిగా కొండగొర్ల సంతోష్



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** మండల బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా కొండగోర్ల సంతోష్ ను నియమిస్తూ బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజక వర్గం ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం పుట్ట మధుకర్ గారి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, కాళేశ్వరం దేవస్థానం చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు మహాదేవ పూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మహదేవ పూర్ సర్పంచ్ శ్రీపతి బాపు, మార్కెట్ కమిటీ చేర్ పర్సన్ పెండ్యాల మమత మనోహర్, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు బండం లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు ఆలీంఖాన్, సంద్రుపల్లి సర్పంచ్ సురేందర్ పాల్గొన్నారు.

## రేపు వరంగల్ పార్లమెంట్ ప్రవాస్ యోజన



**వరంగల్ వాయిస్, పరకాల :** కేంద్ర మంత్రి బీఎల్ వర్మ ముఖ్య అతిథిగా రేపు మహాదేవపూర్ రోడ్డులో గల జీఎస్ఆర్ గార్డెన్ లో నిర్వహించే వరంగల్ పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను గురువారం బీజేపీ నేతలు పరిశీలించారు. వరంగల్ పార్లమెంటు ప్రభారి డాక్టర్ మురళీధర్ గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, రాష్ట్ర నాయకులు దేవునూరి మేఘనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పి జయంతి లాల్, పరకాల పట్టణ అధ్యక్షులు మార్త భిక్షపతి, కొలనుపాక భద్రయ్య, బెజ్జంకి పూర్ణ చారి, పట్టణ ప్రధాన కార్యదర్శి గాజుల నిరంజన్, రాము, చెరుపల్లి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ఖర్చులు కట్టుదిట్టంగా నమోదు చేయాలి

### కలెక్టర్, ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ప్రతి అభ్యర్థి ఎన్నికల వివరాలను భారత ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాల ప్రకారం కట్టుదిట్టంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా అన్నారు. గురువారం ప్రగతి భవన్ లో జిల్లా ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా రాబోయే అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల ఖర్చుల నమోదుపై అకౌంటింగ్ బృందాలతో రివ్యూ నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలను నిబంధనల ప్రకారం కట్టుదిట్టంగా నమోదు చేయాలని, పారదర్శకంగా ప్రతి అభ్యర్థికి సమాన హక్కులు కల్పిస్తూ ఎన్నికలను నిర్వహించాలన్నారు. భారత ఎన్నికల కమిషన్ తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గానికి అభ్యర్థి ఎన్నికల ఖర్చు వేయడం గరిష్ట పరిమితి 40లక్షలుగా నిర్ధారించిందని కలెక్టర్ తెలిపారు. రాబోయే రోజులలో జిల్లాలో జరిగే రాజకీయ పార్టీల సమావేశాలు సభలు ,ఫ్లెక్సీలు, బ్యానర్లు, కరపత్రాలు పంపిణీ , వీఐపీలు పాల్గొనే బహిరంగ సభలు వాటికి అయ్యే వివరాలను నిశితంగా పరిశీలించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు మేరకు అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాలన్నారు. నామినేషన్ వేసినప్పటి నుంచి అభ్యర్థి ఎన్నికల కోసం చేసే ఖర్చులకు ప్రత్యేకమైన బ్యాంకు ఖాతా ప్రారంభించాల్సి ఉంటుందని, అందులో నుంచి మాత్రమే ఎన్నికల ఖర్చులు చేయాలని, వీటిని పరిశీలించేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ఎన్నికల వ్యయ పరిశీలకులు, వీడియో సర్వేలైన్స్ బృందాలు వీడియో వ్యూంగ్ బృందాలు, అకౌంటింగ్ బృందాలు, మానిటరింగ్ సెల్ కాల్ సెంటర్, స్టాటిక్ సర్వ లైన్స్ బృందాలు, వ్యయ మానిటరింగ్ సెల్ మొదలగు బృందాలు వారికి కేటాయించిన విధులను పకడ్బందీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇకపై ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ఎన్నికల కరపత్రాలు ఫ్లెక్సీలు బ్యానర్లు ముద్రించే సమయంలో తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని, ఎన్నికల ఫ్లెక్సీలపై ఎవరు ముద్రిస్తున్నారో వారి ఫోన్ నెంబర్ తప్పనిసరిగా ప్రింట్ చేయాలన్నారు. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం ప్రభావం ఉండకుండా నిరంతరం నిఘా ఉండాలని, అభ్యర్థులు ఎన్నికల ఖర్చుపై అధికారులు డేగ కన్నుతో పరిశీలించాలన్నారు. ప్రజా ప్రాతినిధ్య 1951ప్రకారం ఎన్నికల ప్రవర్తన నియమాలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ఆడిట్ ఆఫీసర్ శ్రవణ్ , డీపీఆర్ఓ వి.శ్రీధర్, డీపీఓ ఆశా లత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు .

# బీఆర్ఎస్ పార్టీకి ప్రజలను ఓటు అడిగే అర్హత లేదు

### సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజా సంక్షేమాన్ని మరిచిన బీఆర్ఎస్ పార్టీకి ప్రజలను ఓటు అడిగే అర్హత లేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం భీమదేవరపల్లి మండల కొత్తకొండ, గట్ల నర్సింగాపూర్, వంగర, ముల్కనూర్, కొత్తపెల్లి గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, దళితులకు మూడెకరాల భూమి, అమలు చేయకుండా పేద బడుగు వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. 9సంవత్సరాల కాలంగా ఇండ్లు ఇస్తామని హామీ అమలు చేయకుండా ఎన్నికల ముందు గృహలక్ష్మి పథకం ద్వారా లబ్ధిదారుల ఎన్నిక పేరుతో హడావిడి చేశారని విమర్శించారు. నిరుద్యోగ భృతి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. 75సంవత్సరాల స్వతంత్ర భారతంలో పేదలు ఇంకా సొంత ఇల్లు లేకుండా గుడిసెల్లో ఉండేటువంటి పరిస్థితి ఇంకా కొనసాగుతుందన్నారు. నరేంద్ర మోడీ విదేశాల్లో దాచిన నల్లధనం తీసుకువచ్చి ప్రతి కుటుంబానికి 15లక్షల రూపాయలను జమ చేస్తామన్న మాట నిలబెట్టుకోలేదన్నారు. ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహణతో పాటు రాజకీయ పార్టీలు ఎన్నికల సందర్భంగా ఇచ్చే హామీల అమలుపైన కూడా ఎన్నికల కమిషన్ దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. సుప్రీంకోర్టు ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపైన చట్టబద్ధమైన చర్యలు తీసుకోవడం కొరకు న్యాయవ్యవస్థ సైతం జోక్యం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరుపాక అనిల్ కుమార్, మండల కార్యదర్శి ఆధార్ శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొంగల రామచంద్రారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మంచాల రమ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మంచాల తిరుపతి, రావుల తిరుపతి, బాలరాజు, సునీల్, రవి, తిరుపతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# బూటకపు ఎన్నికలను బహిష్కరించండి

### బీజేపీ, బీఆర్ఎస్‌లను తరిమికొట్టండి
### భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్ట్) పిలుపు


భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్ట్)
భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ (బీకే-ఏఎస్ఆర్)
తేదీ: 01.12.10.2023
పత్రికాప్రకటన
బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీని, దీనికి మద్దతునిచ్చే అవకాశవాద బీఆర్ఎస్ ను తన్ని తరమండి !
బూటకపు ఎన్నికలను బహిష్కరించండి !

**వరంగల్ వాయిస్, వరంగల్ :** బూటకపు ఎన్నికలను బహిష్కరించాలని, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీని, దీనికి మద్దతునిచ్చే అవకాశవాద బీఆర్ఎస్ ను తన్ని తరమి కొట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్ట్) పిలుపునిచ్చింది. రాష్ట్రంలో, దేశంలో పది సంవత్సరాల బీఆర్ఎస్, బీజేపీ పాలన మూలంగా పేదల బతుకుల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు . అధికారం కోసం అత్యంత అవినీతి పరులు, దుర్మార్గులు గత పాలనలో చేసిన అవినీతి, అక్రమాలన్నింటిని మరిచి మేము నిజాయితీ కలిగిన, అవినీతి రహిత, పారదర్శకమైన పాలకులమంటూ సిగ్గూ ఎగ్గూ లేకుండా ప్రజల ముందుకు తిరిగి వస్తున్నారని చెప్పారు. అధికారం ఉన్నంత కాలం ప్రజల సంక్షేమాన్ని, ప్రజల మౌలిక సమస్యలను గాలికి వదిలి, అధికారం సాధించడమే ప్రధాన లక్ష్యంగా ప్రజల రాజకీయ వెనక బాటుతనాన్ని ఆసరా చేసుకొని అబద్ధపు వాగ్దానాలూ, డబ్బు, మద్యం, కులం, మతం పేరుతో ఓట్ల కోసం తిరిగి అనే పార్టీలు ప్రజలను మరోమారు వంచించడానికి వస్తున్నాయని విమర్శించారు. గతంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదు, ఎన్నికలు రాగానే రైతు బంధు, దళిత బంధు, బీసి బంధు, గిరిజన బంధు అంటూ ప్రజలను మాయ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.భారత రాజ్యాంగాన్ని నామమాత్ర సమాఖ్య (ఫెడరల్) వ్యవస్థను దెబ్బతీసి, బలమైన కేంద్రీకృత బ్రాహ్మణీయ హిందుత్వ నిరంకుశ కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే లక్ష్యంతో పని చేస్తుందని అన్నారు. ఈ పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి, కొత్తగూడెం డివిజన్ కమిటీ అల్లూరి సీతారామరాజు పేరుతో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్ట్)ఒక ప్రకటన విడుదల చేసింది.

# మీడియా సెంటర్‌ను ప్రారంభించిన కలెక్టర్ శశాంక




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయంలోని జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ ను,మొదటి అంతస్తులోని ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం (1950)ను గురువారం అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ తో కలిసి జిల్లా కలెక్టర్ కె.శశాంక ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా జిల్లాలో అనుమతి పొందిన జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు, ఇతరులు ఈ కేంద్రం ద్వారా ప్రచురణ పత్రాలే కాని, గోడ పత్రికలే గానీ, సామాజిక మాధ్యమాలలో గానీ, ఏవైనా ప్రకటనలు చేయుటకు అనుమతులు ఇవ్వబడునని, దీని కోసం నిర్దేశించిన పత్రాలలో దరఖాస్తు చేసుకోవలసి ఉంటుందని తెలిపారు. రాజకీయాలకు సంబంధించిన ప్రకటనలు, టీవీ చానల్ మాధ్యమం, కేబుల్ నెట్ వర్క్ ద్వారా టెలీకాస్ట్ చేసినచో సంబంధిత అధికారులచే ముందస్తుగా అనుమతులు పొందవలసి ఉంటుందన్నారు. ముందస్తుగా అనుమతులు పొందకుండా ప్రచురణ జరిపిన టీవి, కేబుల్ మాధ్యమాలను ఎటువంటి ప్రకటనలు చేసినా, దీనిని ఉల్లంఘన క్రింద పరిగణింపబడుతుందని, నోటీసులు జారీ చేయబడతాయని అన్నారు. బల్క్ ఎస్ఎంఎస్ లు గాని ఆడియో-వీడియో ఎస్ఎంఎస్ లు గానీ సినిమాలో ప్రకటనలు, ఎఫ్ఎం రేడియోలో గానీ ప్రకటనలు జారీ చేసినచో తప్పనిసరిగా జిల్లా ఎన్నికల అధికారి అనుమతి పొందియుండాలన్నారు. నమోదు చేసుకున్నటు జాతీయ, రాష్ట్రీయ పార్టీలు, ఎన్నికల పోటీల బరిలో ఉన్న అభ్యర్థులు తప్పనిసరిగా మూడు రోజుల ముందుగా అనుమతి పొంది యుండాలని, నమోదు చేసుకోనటువంటి పార్టీలు, ఇతరులు 7రోజుల ముందుగా దరఖాస్తు చేసుకొనియుండాలని కావున జరుగబోయే రాష్ట్ర శాసన సభ ఎన్నికలలో పాల్గొనదలచుకున్నటువంటి పార్టీలు, అభ్యర్థులు, ఇతరులు తప్పనిసరిగా పై సూచనలు పాటించాలని కలెక్టర్ తెలిపారు. మొదటి అంతస్తులోని ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం (ఫిర్యాదుల స్వీకరణ మరియు సమాధాన కేంద్రం) (1950)ను ప్రారంభించి దూర ప్రాంతాల నుంచి ఫిర్యాదు చేయదలచుకున్న వారు 1950 నెంబర్ కు ఫోన్ ద్వారా గాని సీ-విజిల్ అనే యాప్ ద్వారా గానీ తమ ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఇతరులు పొలిటికల్ గా చేసినటువంటి ఎటువంటి ఖర్చులపైన నిఘా ఉంచి, వారి ఖర్చును నమోదు చేయడం కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి సుధాకర్, గ్రౌండ్ వాటర్ అధికారి సురేష్, డీపీఆర్ఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దుర్గాదేవి ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా బైరి రాంబాబు



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** మండలంలోని ముల్కనూర్ గ్రామంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో 10సంవత్సరాలుగా నిర్వహించబడుతున్న శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల అధ్యక్షుడిగా బైరి రాంబాబును ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు గుండేటి శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా సకినాల రమేష్, ఉపాధ్యక్షుడిగా పిల్లల శ్రీధర్, కోశాధికారిగా గణవేని విజయ్ లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు కమిటీ తరపున చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. 10సంవత్సరాలుగా దిగ్విజయంగా కొనసాగుతున్న శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలకు దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పిల్లల రమేష్, బైరి సదానందం, పోతుగంటి రాకేష్, గుడికందుల కిషోర్, దూలం జగన్,పెట్టం యుగంధర్, గుడికందుల శ్రీకాంత్, ఉడుత శ్రీనాథ్, బసవరాజు రమేష్ తదితరులు ఉన్నారు.

## పుష్కర వసంతాల సేవకు పురస్కారం

### జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు దూడల రమేశ్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, జనగామ :** మండలంలోని వెంకిర్యాల గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న దూడల రమేష్ కు జనగామ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు స్వీకరించిన సందర్భంగా గురువారం పాఠశాల ఉపాధ్యాయురాలు నల్లా లలిత అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జనగామ మండల నోడల్ అధికారి వంగాల రాజేందర్, గ్రామ సర్పంచ్ కీర్తి లక్ష్మీ నర్సయ్య హాజరై మాట్లాడుతూ గత 34 సంవత్సరాలుగా ఎంతోమంది విద్యార్థులను రమేష్ ఉన్నతులుగా తీర్చిదిద్దారని అన్నారు. అందుకే వారు చేసిన సేవలకు గుర్తించి ప్రభుత్వం జనగామ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును అందించిందని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ ఇది మరింత బాధ్యతలను పెంచినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ తాళ్లపల్లి అశోక్ గౌడ్, హై స్కూల్ హెడ్మాస్టర్ విష్ణు, ఉపాధ్యాయులు లలిత, విద్యారాణి, స్రవంతి ,నరసింహారెడ్డి, నరేందర్, అనురాధ, జగదాంబ, స్వరూప, ఏఎన్ఎం మౌనిక, ఆశ వర్కర్లు భాగ్యలక్ష్మి, యమునా, మహిళా మహిళా మండలి నాయకులు శ్రీలత, మణెమ్మ, విజయ, దుర్గం మమత, తేలు నవనీత, ఆయాలు ఎలేంద్ర, లక్ష్మి గ్రామస్తులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిలో పోలీసుల ముమ్మర తనిఖీలు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** ఎన్నికల షెడ్యూలు వెలువడంతో జనగామ జిల్లాలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. గురువారం హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారుల గల కొమ్మల గేటు వద్ద జనగామ రూరల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి నేపథ్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రఘునాథపల్లి లింగాల గణపురం, చిల్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందని, పోలీస్ సిబ్బంది నిత్యం వచ్చి పోయే వాహనాలను తనిఖీ చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. రూ. 50 వేల నగదుకు మించి తీసుకెళ్లిన వారు విధిగా సరైన ఆధారం చూపాలని, లేదంటే ఆ మొత్తాన్ని పోలీసులు సీజ్ చేస్తారని పేర్కొన్నారు. దసరా, దీపావళి పండుగలు, పెళ్లి శుభకార్యాలకు గానూ వెండి, బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేవారు వాటికి సంబంధించిన రశీదులను వెంట తీసుకురావాలని లేదంటే, వాటిని సీజ్ చేసే అవకాశం ఉంటుందని పోలీసులు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండడం జరుగుతుందని సీఐ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రఘుపతి, వినయ్ కుమార్చ ప్రవీణ్ పాల్గొన్నారు.

## బతుకమ్మ తెలంగాణ సాంప్రదాయం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** బతుకమ్మ తెలంగాణ సాంప్రదాయమని పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. కురవి మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ముందస్తు బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంప్రదాయ దుస్తుల్లో ధరించిన విద్యార్థినిలు తంగేడు, బంతి పూలతో పాటు వివిధ రంగురంగు పూలతో బతుకమ్మను అలంకరించి స్కూల్ ఆవరణలో పాటలు పాడుతూ నృత్యాలు చేస్తు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలు తెలియజేయాలనే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వహిద్, టీచర్లు అనిత, శ్యామల దేవి, విజయలక్ష్మి తెలిపారు. కళ, ఉదయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నవోదయ ఉన్నత పాఠశాలలో..



**వరంగల్ వాయిస్, శాయంపేట:** మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో కోలాటాలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మామిడి పృథ్వీ, మామిడి అనురాధ, ఉపాధ్యాయులు శివ, రాజేందర్, వెంకట్, సందీప్, స్వాతి, జయ, ప్రసోన, సంధ్య, మౌనిక, సంధ్య, ఐశ్వర్య, సుమలత, మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిద్ధార్థ హైస్కూల్‌లో..




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** డివిజన్ కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్ లో గురువారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తీరక్క పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలను ఒక్కచోట ఉంచి విద్యార్థులు, మహిళా ఉపాధ్యాయులు ఆడి పాడి సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను సమీప నీటి కొలనులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ముత్తినేని సోమేశ్వరరావు, కరస్పాండెంట్ ముత్తినేని జయప్రకాష్, ఉపాధ్యాయులు మంజుల, విజయలక్ష్మి, కవిత, కల్పన, కోమల, శారద, కృష్ణవేణి, శ్రావణి, ధనలక్ష్మి, సుకన్య పాల్గొన్నారు.

## బిట్స్ అస్మాక హైస్కూల్‌లో..



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కాశిబుగ్గలోని బిట్స్ అస్మాక హై స్కూల్ లో గురువారం మినీ బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులు అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకురాగా సంతోషంతో వాటి చుట్టూ తిరుగుతూ ఆడుతూ పాటలు పాడారు. ఉత్తమంగా ఉన్న బతుకమ్మలకు సబ్ జూనియర్స్ , జూనియర్స్ ,సీనియర్స్ వారీగా సెక్రటరీ డాక్టర్ జి రాజేంద్రప్రసాద్ రెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం పిల్లలు తయారు చేసిన రావణాసుర వధ కార్యక్రమంలో పాల్గొని దానికి నిప్పంటించారు . ఈ కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల సెక్రటరీ డాక్టర్ జి రాజేంద్రప్రసాద్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ ఏ.పావని, ప్రిన్సిపల్ సంతోష్ విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉడుకు రక్తం.., యువ కెరటం. ఏదైనా చేయాలనే సంకల్పం.., తెగించి పోరాడే సత్తువా. అన్నీ కలిసిన సిద్ధం నరేష్ పటేల్ పోటీకి సై అంటున్నారు. తూర్పులో కరుడుగట్టిన మొరటుతనం., వేళ్లూనుకుపోయిన బరితెగింపును కూకటి వేళ్లతో పెకిలించాలని కసిమీదున్న ధైర్యమంతడు. కమలం అంటే ప్రాణంగా భావిస్తూ, మోదీ నాయకత్వాన్ని ఆజ్ఞగా ఆచరిస్తూ పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుడతడు. ప్రజల జీవితాలు బాగుపడాలంటే మార్పు అనివార్యమని, దమ్మున్న నాయకులతోనే అది సాధ్యమని నమ్మే నరేష్ భారతీయ జనతాపార్టీలో కీలకంగా పనిచేస్తున్నారు. పార్టీ తలపెట్టిన ఎన్నో కార్యక్రమాలను భుజానికి ఎత్తుకుని ఒంటిచేత్తో వాటిని విజయవంతంగా పూర్తి చేసిన ఘనత ఆయనది. పదవుల కోసం పరితపించకుండా, పనిచేయడం, పార్టీకి కీర్తిప్రతిష్టలు ఆపాదించడానికి కంకణం కట్టుకున్న ఆయన శ్రమకు గుర్తింపు వచ్చింది. తూర్పు బరిలో బీజేపీ తరపున టిక్కెట్ కేటాయించే ఆలోచనలో పెద్దలున్నట్టు లీకులు వస్తుండడంతో పార్టీకి మరిన్ని మంచిరోజులు వచ్చినట్టే అని అభిమానులు, శ్రేణులు సంబురపడుతున్నాయి.

# కమలంలో.. కదనోత్సాహం

## తూర్పు బరిలో యువనేత..?

## పోటీకి సిద్ధమంటున్న సిద్ధం నరేష్ పటేల్

### సామాజిక వర్గం అదనపు బలం..

### పార్టీ కోసం శ్రమించిన నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు..



### ఆపదలో నేస్తమతడు..

సిద్ధం నరేష్ పటేల్ ది ఎముక లేని చేయి. కష్టమొచ్చింది అంటే చాలు రక్షణ వలయంగా కనిపెట్టుకుని ఉండే నైజం అతడిది. సాయం చేయడంలో ఆయన వెనకాముందు ఆలోచనే చేయరు. నియోజకవర్గంలోని వేలాది కుటుంబాలకు ఆయన కల్పించిన భరోసా, ఆర్థికంగా ఆదుకున్న విధానం ఎంత చెప్పినా తక్కువే. మంచి, చెడులకు పలకరిస్తూ.. తనకు తోచిన సాయాన్ని అందిస్తున్నాడు. నరేష్ మదికి తమ సమస్య చేరితే.. పరిష్కారం దొరుకుతుందనే నమ్మకం తూర్పు ప్రజల్లో పాతుకుపోయింది. ఆయన చలాకీ తనం.. కమిట్‌మెంట్ వీటిని నిరూపిస్తుంది. కరోనా సమయంలో ఎంతో మందికి అండగా నిలిచాడు. ఆర్థిక సాయంతో పాటు.. కిరాణ సామగ్రి, కూరగాయాలు పంపిణీ చేశారు. పార్టీకి నమ్మిన బంటుగా నరేష్ పటేల్ కొనసాగుతున్నాడు. పార్టీకి తూర్పు నియోజకవర్గంలో వైభవాన్ని తీసుకొచ్చేందుకు తన శక్తి మేర కృషి చేస్తున్నాడు. ఆయన పార్టీకి కంకణ బద్ధుడైన తీరు చూసి.. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇచ్చింది.

### ఉప ఎన్నికల్లో కీలకంగా..

దుబ్బాక, హుజూరాబాద్, నాగార్జున సాగర్, హుజూర్ నగర్ ఉప ఎన్నికల్లో నరేష్ పటేల్ కీలకంగా పని చేశారు. పార్టీ అప్పగించిన పనికి కంకణబద్ధుడై అటు ప్రచారంలోనూ, ఇటు ప్రతిపక్షాల ఎత్తులను చిత్తుచేయడంలోనూ కీలకంగా వ్యవహరించారు. వైరి పార్టీలకు అర్థం కాని రీతిలో వ్యూహాలు రచిస్తూ వారికి ముప్పుతిప్పలు పెట్టారు. పార్టీని జనాల్లోకి తీసుకెళ్లేందుకు, జనాల సమస్యలపై పోరాటం చేసేందుకు ముందుండి కదిలారు. దుబ్బాక ఎన్నికల ప్రచారకర్తగా పని చేసిన నరేష్, పార్టీని సామాన్య ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రసంగాలు, వ్యూహాలతో విజయానికి బాటలు పరిచారు.

### కేటాయిస్తే సీటు గ్యారంటీ..

రానున్న ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు నరేష్ పటేల్ ఉత్సాహం చూపుతున్నారు. ఆయన పని తీరు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ, సేవాగుణం వంటి ఎన్నో అంశాలు కలిసొచ్చే అంశాలే. నాలుగు ఉప ఎన్నికల్లో ప్రచార కర్తగా పార్టీ పెద్దల వద్ద ఆయనకున్న పేరు మరింత అదనపు బలం. క్రమశిక్షణ, కృషి, కష్టపడి పనిచేసే తీరును గుర్తించే పార్టీ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా నియమించిన విషయం తెలిసిందే. తాజాగా పార్టీ తన సేవలను గుర్తించి అసెంబ్లీ ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గం నుంచి బరిలో నిలుపుతుందని ఆశిస్తున్నాడు.

### అక్కడే గురి..

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ రానే వచ్చింది. ఈ విడత రాష్ట్రంలో కాషాయం జెండా ఎగురేయాలనే కసితో పార్టీ పావులు కదుపుతోంది. ఈ క్రమంలోనే గెలుపు గుర్రాల కోసం రాష్ట్ర పెద్దలు సీరియస్ గా నిఘా పెట్టారు. అందులో భాగంగానే వరంగల్ తూర్పు నియోజకవర్గంలో సత్తా ఉన్న నాయకుడికే టిక్కెట్ ఇవ్వాలని నిర్ణయించి, అందుకు అనుగుణంగా సరైన యూత్ ఫాలోయింగ్ తో పాటు ప్రజల్లో విచ్చలవిడిగా నానే పేరున్న నరేష్ కే టిక్కెట్ ఇవ్వాలనే ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. పార్టీ కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా పాల్గొంటూ ఇప్పటికే అధిష్టానం దగ్గర మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పై నియోజకవర్గంలో భారీ వ్యతిరేకత ఉండడంతో ఈసారి తూర్పులో ఎలాగైనా జెండా ఎగురవేయాలని బీజేపీ చూస్తోంది. ఈ మేరకు క్లీన్ ఇమేజ్ ఉన్న యువ నేతలను బరిలో దించేందుకు సిద్ధమైంది.

### నరేష్ సేవ కార్యక్రమాలు..

- అయోధ్యలో రామ మందిరాన్ని నిర్మాణానికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. గడపగడపకూ వెళ్లి రూ.2లక్షల విరాళాలు సేకరించి పంపారు. ఇందులో భాగంగా వరంగల్ జిల్లా కరీమాబాద్ ఏకశిల నగర్ లో ప్రజలకు తెలియజేసేందుకు బైక్ ర్యాలీ నిర్వహించారు.
- దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూం ఇళ్లు, బ్యాక్ లాగ్ పోస్టులు, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు వెంటనే విడుదల చేయాలని వరంగల్ బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జన్ను మధు ఆధ్వర్యంలో నరేష్ డిమాండ్ చేశారు.
- కాళోజీ హెల్త్ యూనివర్సిటీలో మెడికల్ సీట్ల విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తూ వరంగల్ అర్బన్ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు సిద్ధం నరేష్ పటేల్, పార్టీ నాయకులు కేఎంసీని ముట్టడించారు.
- నరేష్ సోషల్ యాక్టివిటీస్‌లో చురుగ్గా పాల్గొంటున్నాడు. స్వామి వివేకానంద, అటల్ బీహార్ వాజ్‌పేయి జయంతి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. శిబిరాలు నిర్వహించి రక్తదానం చేశారు. కరోనా సమయంలో దాదాపు 40 రోజుల పాటు వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలకు ఆయన బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. ఉచిత ఆహార సేవను అందించారు.
- నిరుద్యోగ సమస్యల పరిష్కారం, ఖాళీగా ఉన్నా 2 లక్షల ఉద్యోగాలు వెంటనే ప్రకటించాలని, 33 నెలల నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేస్తూ వరంగల్ చౌరస్తా నుంచి హన్మకొండ అమరవీరుల స్థూపం వరకు భారీ బైక్ ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ వరంగల్ అర్బన్ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ హాజరై జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు.
- నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో సీఎం కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని జీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సిద్ధం నరేష్ పటేల్ ఆధ్వర్యంలో నాయకులు వరంగల్‌లో షూ పాలిష్ చేసి నిరసన తెలిపారు.
- ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏడేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సేవ హి సంఘటన్ పేరుతో నిర్వహిస్తున్న సేవ కార్యక్రమాల్లో భాగంగా నరేష్ పటేల్ 33వ డివిజన్ పరిధిలోని శాంతినగర్ ప్రాంతంలో దాదాపు 100 మంది పేదలకు, దినసరి కూలీలకు బియ్యం, నిత్యావసర సరుకులు కూరగాయలు అందజేశారు.



- గడ్డం కేశవమూర్తి








# బుల్లెట్ వదిలి.. బ్యాలెట్ బాటలోకి

## పోటీకి సై అంటున్న మాజీలు





**వరంగల్ వాయిస్, వరంగల్ :** తుపాకి గొట్టం ద్వారా రాజ్యాధికారం సాధ్యం కాదని మాజీలు, నక్సలైట్ కుటుంబ సభ్యులు ఎన్నికల బరిలోకి వస్తున్నారు. ఇప్పటికే జనశక్తి అజ్ఞాత దళం వీడి జనజీవన స్రవంతి చేరిన ధన్నసిరి అనసూయ అలియాస్ సీతక్క ములుగు ఎమ్మెల్యేగా తిరిగి కాంగ్రెస్ పక్షాన బరిలోకి దిగుతోంది. సీతక్కకు పోటీగా ఎన్ కౌంటర్ లో మరణించిన నక్సలైట్ నాయకుడు బడే నాగేశ్వర్ రావు కూతురు బడే నాగజ్యోతి అధికార బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగుతోంది. ఇదే క్రమంలో మాజీ మావోయిస్ట్ నాయకుడు గాజర్ల అశోక్ అలియాస్ ఐతును కాంగ్రెస్ పార్టీ పరకాల నుంచి బరిలోకి దించుతున్నట్లు ప్రచారం సాగుతోంది. అశోక్ సోదరులిద్దరు మావోయిస్టు పార్టీలో కీలక భూమిక నిర్వహించారు. ఇందులో గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్



ఎన్ కౌంటర్ లో మృతి చెందగా గాజర్ల రవి అలియాస్ గణేశ్ ప్రస్తుత మావోయిస్ట్ కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. అదే విధంగా వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబు కొడుకు మాచర్ల మహేశ్ కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

### కాంగ్రెస్‌లో చేరిన గాజర్ల..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు గాజర్ల అశోక్ అలియాస్ ఐతు గురువారం పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పటికే తన సహచరులు, అనుచరులతోపాటు వివిధ వర్గాల వారితో సంప్రదింపులు జరిపిన అశోక్ వారి సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన పార్టీలోకి రావడం మూలంగా పార్టీలో చేరికలు ఉంటాయని తెలుస్తోంది. మొత్తానికి వరంగల్ జిల్లాలో ఇప్పుడు గాజర్ల అశోక్ కాంగ్రెస్ చేరడం సంచలనంగా మారింది.

# దసరా ఉత్సవాలకు రండి

## మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు వినతి

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** అంగరంగ వైభవంగా ఉర్సు రంగలీల మైదానంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు రావాల్సిందిగా పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును దసరా ఉత్సవ కమిటీ ఆహ్వానించింది. గురువారం మంత్రి నివాసంలో దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపురి సంజయ్ బాబు ఆధ్వర్యంలో కలిసిన బృందం ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో సద్దుల బతుకమ్మ, దసరా సంప్రదాయబద్ధమైన పండుగలన్నారు. రంగలీల మైదానంలో అత్యంత వైభవంగా నిర్వహించే ఉత్సవాలను ప్రతి ఏడు మాదిరిగానే ఈ ఏడు కూడా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దసరా ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మంద వెంకన్న గౌడ్, కన్వీనర్ వొడ్నాల నరేందర్, ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్, సహాయ కోశాధికారి వెలిదె శివమూర్తి, ఉపాధ్యక్షులు గోనె రాం ప్రసాద్, నాగపురి రంజిత్ గౌడ్, పొగాకు సందీప్, దామెరకొండ వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శులు బజ్జూరి వాసు, పూదని అజయ్, బత్తిని అఖిల్ గౌడ్, నాగపురి అశోక్, కార్యదర్శులు నాగపురి మహేశ్, గట్టు గోవర్ధన్, నాగపురి సంతోష్, నరిగె శ్రీనివాస్, ఆర్గనైజర్లు నాగపురి కాళిదాస్, బిట్ల క్రాంతి, మోడెం రాజశేఖర్, గట్టు రవి చందర్, బైరగోని మనోహర్, పార్వతి కృష్ణంరాజు, బత్తిని రంజిత్, కస్తూరి వంశీకృష్ణ, యెలగందుల కృష్ణమూర్తి, గట్ట బాలసాయి, జయ మహేశ్, రేవంత్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌చార్జి సీపీగా మురళీధర్

**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనర్‌గా పని చేస్తున్న రంగనాథ్ బదిలీ కావడంతో క్రైం డీసీపీ మురళీధర్‌కు ఇన్చార్జి సీపీగా బాధ్యతలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ అప్పగించింది. ఇదిలా ఉండగా.. వరంగల్ సీపీగా ఎవరు వస్తారనే విషయంపై ఆసక్తి నెలకొంది. రాష్ట్ర సీఎస్ ఎన్నికల కమిషన్‌కు మూడు పేర్లను ప్రతిపాదించి పంపించాలి. అందులో కేంద్ర ఎన్నికల సంఘం ఎంపిక మేరకు డీఐజీ ర్యాంక్ అధికారికి వరంగల్ సీపీగా పోస్టింగ్ ఇవ్వనున్నారు.

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన




**వరంగల్ వాయిస్, నెక్కొండ :** నెక్కొండ పట్టణ కేంద్రంలో శ్రీ ధరణి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కళ్లేపు శోభారాణి ఆధ్వర్యంలో గురువారం రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా వారి డీఈఏ ఫండ్ స్కీమ్ ద్వారా స్థానిక స్వయం సహాయక సంఘాల మహిళలకు, రైతులకు, యువకులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లీడ్ బ్యాంక్ ఎఫ్ ఎల్ సీ, యూనియన్ బ్యాంక్ కౌన్సిలర్ భాస్కర చారి, ఏపీజీవీబీ అర్ ఓఎఫ్ ఎల్ సీ కౌన్సిలర్ ప్రేమ్ కుమార్ విచ్చేసి కార్యక్రమాన్ని ఉద్దేహించి మాట్లాడుతూ అందరు ఆర్థిక అక్షరాస్యత పైన పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకొవాలన్నారు. సామాజిక భద్రత పథకాలైన ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను బ్యాంక్ ఖాతాదారులు వినియోగించు కోవాలన్నారు. బ్యాంక్ నుంచి ఋణం పొందాలంటే అందరు సరైన సిబిల్ స్కోర్ ని కలిగి ఉండాలన్నారు. సైబర్ మోసాల పట్ల ఖాతాదారులందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనవసరమైన ఖర్చులు తగ్గించికొని అధిక మొత్తంలో డబ్బుని పొదుపు చేసుకొవాలని సూచించారు. ఎస్బీఐ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ రఘు నందన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉన్నప్పుడే ఆ కుటుంబం ఆర్థికంగా ఎదుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ ఈదునూరి రమేష్, స్వయం సహాయక సంఘాల మహిళల ప్రతినిధులు నాగజ్యోతి, సరోజన, సాకమ్మ, జ్యోతి, సునీత, రాజేశ్వరి, స్థానిక రైతులు, యాకూబ్, వెంకన్న, సంజీవ, సుధాకర్, సురేష్, సంస్థ సిబ్బంది స్వప్న, గణేష్, ప్రణీత్, చిన్న వ్యాపారులు యకయ్యా, జనార్ధన్, రాజమణి, కవిత ప్రముఖ కళాకారులు శ్రీశైలం, రవీందర్ బ్యాంక్ ఖాతా దారులు, ప్రజలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దసరా, దీపావళి నేపథ్యంలో.. ప్రత్యేక రైళ్ల పేరిట బాదుడు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జోన్ బాదుడు షురూ చేసింది. పేద, మధ్య తరగతుల ప్రయోజనాలు పక్కన పెట్టి ఆదాయ మార్గాలను అన్వేషిస్తోంది. పండుగల సందర్భంగా నగర వాసులు తమ సొంతూళ్లకు వెళుంటారు. ఇదే అదునుగా భావించిన దక్షిణ మధ్య రైల్వే రెగ్యులర్ విధానంలో కాకుండా ప్రత్యేక రైళ్లను అధిక సంఖ్యలో నడుపుతూ చార్జీలను అమాంతం పెంచేసింది. ప్రస్తుతం రెగ్యులర్ టికెట్ చార్జీలపై అదనంగా 30 నుంచి 50 శాతం వరకు వసూలు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులకు రైల్వే చార్జీలు తలకు మించిన భారంగా మారుతోంది. పైగా రిజర్వేషన్‌కు దాదాపు రెండు నెలలు ముందుగానే టికెట్ బుక్ చేసుకున్నా.. సీటు దొరుకుతుందన్న గ్యారంటీ లేదు. అంతా వెయిటింగ్ లిస్టు, ఆర్ఏసీతోనే సరిపోతుంది. ఒక వేళ టికెట్ బుక్ చేసుకుని, టికెట్ క్యాన్సిల్ చేసుకుంటే అందులో కూడా 25 నుంచి 50 వరకు చార్జీలు వసూలు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఎస్‌సీఆర్ జోన్ ఆధ్వర్యంలో రెగ్యులర్ రైలు సర్వీసుల సంఖ్య తగ్గిస్తూ.. ప్రత్యేక రైళ్లను నడుపుతున్నది. హైదరాబాద్, సికింద్రాబాద్, నాందేడ్, విజయవాడ, గుంటూరు, గుంతకల్ వంటి డివిజన్ల పరిధిలో ఇప్పటి వరకు దాదాపు 620 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.




# ఘనంగా సమాచార హక్కు చట్టం వార్షికోత్సవం

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** 2005లో పురుడు పోసుకున్న సమాచార హక్కు చట్టం 19వ వార్షికోత్సవాన్ని గురువారం వరంగల్ శంభునిపేట జంక్షన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు వికాస సమితి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం శంభునిపేటలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కేక్ కట్ చేసి పిల్లలకు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా సమాచార హక్కు వికాస సమితి జిల్లా అధ్యక్షుడు సాదుల పూర్ణచందర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో ఆయుధం లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పూజారి హరి ప్రసాద్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందుల వేణు, తూర్పు నియోజకవర్గం కోశాధికారి తవటం రమేష్, మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి కీర్తన హైమ, కందికట్ల జయ, అమ్మ రాజమణి, నర్సంపేట నియోజకవర్గ అధ్యక్షుడు చెట్టి రమేష్, వర్ధన్నపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గుటోజు వేణు, ఖిలా వరంగల్ మండల ప్రధాన కార్యదర్శి వైట్ల రాజు, నల్లబెల్లి మండల అధ్యక్షుడు పోరండ్ల రాజకుమార స్వామి, కొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

# కొమ్మాల స్కూల్లో బతుకమ్మ సంబరాలు



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** వరంగల్ జిల్లాలోని గీసికొండ మండలం కొమ్మాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, విద్యార్థులు ఉపాధ్యాయులు ఎంతో ఆనందంగా బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సవాలను చేశారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాల అంటూ పాటలు పాడారు. కోలాటం ఆడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరామోజు మోహన్ రావు, ప్రాథమిక పాఠశాల ఆర్.చంద్రమౌళి, పాడి రాము, రచ్చ సీతాదేవి, అడ్డగుడి విశ్వేశ్వరరావు, లింగం రాజిరెడ్డి, నటేషన్ మాలతి, అంకేశ్వరపు కుమారస్వామి, దుంపటి లలిత రాణి, చందా రాజేందర్, వనం సంపత్, తక్కల్లాపల్లి శైలజ, లాదెల్లా భాగ్య, నద్దునూరి శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# సి - విజిల్ యాప్‌ను తెలుగులో అందించాలి

## బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎన్నికల్లో జరిగే అక్రమాలు, కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాల్సిన సి - విజిల్ యాప్ ను తెలుగులో అందించాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తెలంగాణ ఎలక్షన్ ఆఫీసర్, జిల్లా ఎలక్షన్ ఆఫీసర్ కు ట్విట్టర్ వేదికగా విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నిబంధనల అతిక్రమణలు, ఫిర్యాదు చేయడానికి చాలా ఉపయోగకరమైన సి-విజిల్ యాప్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ యాప్ 8 భాషల్లో అందుబాటులో ఉంది కానీ విచిత్రం ఏమిటంటే తెలుగు భాషలో అందుబాటులో లేదన్నారు. దక్షిణ భారతదేశంలోని కన్నడ, మలయాళ, తమిళ్ భాషలలో ఉన్నప్పుడు తెలుగులో కచ్చితంగా ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎందుకంటే ఇప్పుడు తెలంగాణలో ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో వివిధ పట్టణాలు, మండలాలు, గ్రామాల్లోని ప్రజలకు తెలుగు తప్ప ఇతర భాషలో అంతగా ప్రావీణ్యం ఉండదన్నారు. కావున ఈ అంశాన్ని పరిశీలించి సి-విజిల్ యాప్ తెలుగు భాషలో కూడా అందుబాటులోకి తేవాలని కొరారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com